జె.కె.సి.టి, ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబానికి రూ. 5000/-లు సాయం

విశాలాంధ్ర-చింతూరు : మండలంలోని మోతుగూడెం పంచాయతీ సుకుమామిడి గ్రామానికి చెందిన బర్రి రాజు(25) అనారోగ్య కారణంగా శుక్రవారం మృతి చెందాడు కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానికుల సలహా మేరకు శుక్రవారం మృతుడి భార్యకు జే.కె.సి, ట్రస్ట్ ద్వారా 5000/- రూపాయలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షేక్ రియాజ్,రామారావు గణేష్ సుకుమారుడి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి హక్కుల రక్షణకు పోరాడే అభ్యర్థులను పీసా కమిటీగా ఎన్నుకోవాలి

ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిరంజీవి

విశాలాంధ్ర-చింతపల్లి : గిరిజనులకు భారత రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులకై పోరాడే అభ్యర్థులను మాత్రమే పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులుగా ఎన్నుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం చింతపల్లి మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి అన్నారు. మండలంలోని చౌడుపల్లి పంచాయతీ వాముగెడ్డ గ్రామంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతమైన పాడేరు, రంపచోడవరం, ఏలూరు ఏజెన్సీ, మన్య ప్రాంతం పార్వతీపురం పిసా కమిటీల ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే అన్నారు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర అటవీ సంరక్షణ చట్టాన్ని షెడ్యూల్ ప్రాంతంలో గ్రామసభల హక్కులను హరించి ఆదివాసి గిరిజనులను అడవి నుండి దూరం చేస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని పీసా గ్రామ సభలను ఉల్లంఘించి గత వైసిపి ప్రభుత్వం చేసుకున్న హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందం ప్రస్తుత ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థను తీసుకువచ్చి పీసా కమిటీ సర్వాధికారాలను తుంగలో తొక్కిందన్నారు. నేడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పీసా కమిటీ ఎన్నికలను నిర్వహించడం స్వాగతిస్తున్నామన్నారు. ఈ పీసా కమిటీ ఎన్నికలలో భారత రాజ్యాంగం ఆదివాసిలకు కల్పించిన చట్టాలు, హక్కులకై పోరాడే అభ్యర్థులను, పీసా చట్టంపై అవగాహన ఉన్న అభ్యర్థులను కమిటీలుగా ఎన్నుకోవాలని ఆదివాసి గిరిజన సంఘంగా పిలుపునిస్తున్నామన్నారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న ప్రయత్నాలను ఆదివాసులు అడ్డుకోవాలన్నారు. ఆదివాసి హక్కులను, చట్టాల రక్షణ కోసం పోరాడే వారిని మాత్రమే పిసా కమిటీ సభ్యులుగా ఎన్నుకోవాలన్నారు. రాజకీయం చేస్తున్న కొద్దిమందికే తప్ప గిరిజన ప్రాంతం చట్టాలు, హక్కులపై మిగతా వారికి అవగాహన లేదని, దానివల్ల గిరిజనులకు ఇప్పటికే తీవ్రమైన నష్టం జరిగిపోయిందని, ఇకనైనా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకొని గిరిజన ప్రాంత ప్రజల హక్కులు, చట్టాలు శత శాతం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పీసా కమిటీ ఎన్నికైన అభ్యర్థులకు పీసా చట్టం హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఆదివాసి గిరిజనులకు అనుకూలంగా ఎన్ని చట్టాలు, హక్కులు ఉన్నా కాగితాలకే పరిమితం అవుతున్నాయన్నారు. రాబోయే కాలంలో జీవో నెంబర్ అమలు, స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదలకు సిద్ధం కావాలని, ఐదవ షెడ్యూల్ ఏరియాలో రాజ్యాంగం కల్పించిన ఆదివాసి హక్కుల రక్షణను మరింత పటిష్టం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘసభ్యులు కిలో సింహాచలం. కొర్ర చిట్టిబాబు, కిలో పరమేశ్వరావు, వంతల ప్రహల్లాద్, కొర్ర రామకృష్ణ, సాగిన అచ్యుత్, యువ నాయకుడు వంతల చంద్రావు, దణేష్, కొర్ర నాగరాజుతదితరులు పాల్గొన్నారు.

సిఆర్పిఎఫ్151 బెటాలియన్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్

విశాలాంధ్ర-చింతూరు : చత్తీస్గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కోరగుట్ట ఇటీవల సిఆర్పిఎఫ్ 151 క్యాంపును ప్రారంభించారు. మావోయిస్టు ప్రభావితప్రాంతం అయిన కొరగుట్ట లో సిఆర్పిఎఫ్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శిబిరాన్ని సీనియర్ అధికారులు కుంట డిఐజి సూరజ్‌పాల్‌వర్మ, 151 కమాండెంట్ రాజీవ్ కుమార్,204 కొబ్రా బెటాలియన్ కమాండెంట్ సంతోష్ కుమార్, ఆదేశాల మేరకు బుధ, గురు, శుక్రవారం మూడు రోజులు సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహణలో భాగంగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ (యఫ్. ఓ. బి)ద్వారా, సి ఆర్ పి యఫ్ సంయుక్తంగా ఒక స్ప్రింగ్ బోర్డ్‌గా పనిచేసి ప్రజలకు సేవలందించే కార్యక్రమంలో ఈ వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో వివిధ కొరగుట్ట లోని గిరిజనులకు వచ్చే స్వల్ప కాలిక వచ్చే వ్యాధులు, దగ్గు, మలేరియా, కీళ్ల నొప్పులు, గాయాలు,జలుబు, జ్వరం, మలేరియా, టైఫాయిడ్, రక్తపోటు తదితర చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొరగుట్ట సమీపంలోని ప్రజలు పురుషులు, మహిళలు, పిల్లలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ క్యాంపులోనే ఆధార్ కార్డు లేనివారికి వెంటనే ఆధార్ కార్డులు జారీ చేసే ప్రక్రియ ప్రారంభించారు. భవిష్యత్తులో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని ఆమె ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ అధికారులు సిబ్బంది, సమీప గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఐక్యత చాటుకున్న మంగళపాలెం గ్రామ ప్రజలు

విశాలాంధ్ర-జి కె వీధి : పీసా కమిటీ ఎన్నికలలో గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఎంఈఓ పర్యవేక్షణలో సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు అధ్యక్షతన స్థానికంగా శుక్రవారం జరిగిన పెసా కమిటీ ఎన్నికలలో ఉపాధ్యక్షుడిగా మచ్చల బాబురావును, కార్యదర్శిగా శెట్టి నరసింహ పడాల్ ను మంగలపాలెం, గుణాలంక, చుట్టూ గొంది గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వీరిని మాజీ పీసా కార్యదర్శి ప్రతిపాదించగా మాజీ సర్పంచ్ గడుతూరి బాబురావు, గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు గాని లేకుండా గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటామంటూ ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపారు.

మైనర్లకు హోటల్స్ గదులు కేటాయించవద్దు

ఐటిడిఏ పి.ఓ.

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : పర్యాటక ప్రాంతాలలో హోటల్ యజమానులు అప్రమత్తంగా ఉండాలని, పాడేరు ఐటిడి ఏ పరిధిలోని హోటళ్లు, రిసార్టులలో మైనర్ బాల బాలికలకు గదులు కేటాయించ వద్దని ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసారు. అపరిచితులు పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హెూటళ్లు, రిసార్టులలో మైనర్లకు గదులు కేటాయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. మైనర్లకు హెూటళ్లలో గదులు కేటాయించడం చట్టరీత్యా నేరమని అటువంటి సంఘటనలు జరిగితే సంబంధిత హెూటళ్లు, రిసార్టుల నిర్వహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల బాలికలు గదుల కోసం ఆశ్రయిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించాలని చెప్పారు. హెూటళ్లు, రిసార్టులలో మైనర్లకు గదులు లేవని నోటీసు బోర్డులో పెట్టాలన్నారు. నిబంధనలు అతిక్రమించకుండా హెూటల్ కార్యక్రమాలులు నిర్వహించాలని సూచించారు.

పత్రికా విలేఖర్లు కావలెను

విశాలాంధ్ర తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఈక్రింది మండలాలు మారేడుమిల్లి, రంపచోడవరం, ప్రాంతాలకు అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెం.
7989138129,
7386603589

మారంగ్ గోంకే జైపాల్‌సింగ్ జయంతిని అధికారికంగా జరపాలి : మాణిక్యం సమరెడ్డి

కేంద్ర కమిటీ ప్రతినిధి దండకారణ్య ఉద్యోగ సమితి

విశాలాంధ్ర-జి.మాడుగుల : మన దేశ జాతీయ క్రీడా ఐనా మొదటి హాకీ మొదటి కెప్టెన్, రచయిత, ఆదివాసీ నేత, ఆదివాసీ ప్రతినిధి రాజ్యాంగ సభ సభ్యుడు, ఆదివాసీ మొదటి సివిల్ సర్వేంటైనా మారంగ్ గోంకే జైపాల్ సింగ్ ముండా జయంతిని అధికారికంగా జరపాల్సిన అవసరముందని దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ ప్రతినిధి మాణిక్యం సమరెడ్డి కేంద్ర, రాష్ట్రాలకు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. గోంకే జైపాల్ సింగ్ ముండా జయంతిని 123వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నాడువిలేకరులతో మాట్లాడుతూ గోంకే జైపాల్ సింగ్ ముండా భారతదేశ జాతీయ క్రీడైనా హాకీ 1928 లో సారధ్యం వహించి భారత దేశానికీ గోల్డ్ మెడల్ అందించారు. ఆదివాసీ మొదటి సివిల్ సర్వేంట్ ఆదివాసీ నేతగా ఆదివాసుల తరపున రాజ్యాంగ సభలో సభ్యులుగా ఉండి ఆదివాసుల చరిత్రను సభలో ఉటంకించి, ఆదివాసుల ఉనికి కోసం, మనుగడ కోసం మాట్లాడుతూ ఈ దేశమే ఆదివాసులదై నప్పుడు ఈరాజ్యాంగ కూర్పులో ఆదివాసులకు అన్యాయం జరగడానికి వీల్లేదని 299మంది నిండు రాజ్యాంగ సభలో వక్కలించి చెప్పిన ఆదివాసీ నాయకుడు జైపాల్‌సింగ్ ముండాని అన్నారు. రాజ్యాంగసభలో ఈయన పోరాట ఫలితమే రాజ్యాంగంలో నేడున్న ఐదవ, ఆరవ షెడ్యూల్స్ అని జైపాల్ సింగ్ సేవలను జ్ఞాపకం చేశారు. కేవలం ఆదివాసులకే కాకుండా 1928 లో మన భారత దేశ జాతీయ క్రీడైన హాకీ ఓలింపిక్ కప్ జైపాల్ సింగ్ సారధ్యం వహించి భారత దేశానికే కప్ అందించారు. ఇంత చరిత్ర కలిగిన నేత ఆదివాసీ బిడ్డగా ఉన్నప్పటికీ ఆయన చరిత్రను బాహ్యప్రపంచానికి, తెలియ నీయకుండా భారతదేశ పాలకులు చేయడం అన్యాయమన్నారు. కనుకనే ఇలాంటి ఆదివాసీ మేధావుల గొప్పచరిత్ర నేటి జనరేషన్‌కు అందించాల్సిన అవసరం ఉందని దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ ప్రతినిధి మాణిక్యం సమరెడ్డి కేంద్ర, రాష్ట్రాలకు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

'మీకోసం'కు హాజరు కాకపోతే షోకాజ్ నోటీస్ : కలెక్టర్ దినేష్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె.అభిషేక్‌గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, డి.ఆర్.ఓ.కె. పద్మలతతో కలసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 52 వినతులను స్వీకరించారు. జిల్లా అధికారులు కొంత మంది మీకోసం కార్యక్రమానికి హాజరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. ముందస్తు అనుమతి లేకుండా మీకోసంకు శాఖాధికారులు గైరుహాజరైతే షోకాజ్ నోటీస్ జారీ చేస్తామని హెచ్చరించారు. పదేపదే పునరావృ తమవుతున్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అధికారులతో మాట్లాడి పునరావృతమవుతున్న ఫిర్యాదులపై తీసారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి శిక్ష... లక్ష జరిమానా

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో అనంతగిరి బస్సు షెల్టర్ వద్ద ఆర్టీసీ బస్సులో గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికీ 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు లక్ష రూపాయలు జరిమానా చోడవరం జడ్జి కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు అనంతగిరి ఎస్సై డి శ్రీనివాసరావు తెలిపారు. గతంలో అనంతగిరి బస్ స్టాప్ వద్ద ముందస్తు సమాచారం మేరకు గతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఆర్టీసీ బస్సులో పంచాడి సునీల్, కుమార్ బొండం గ్రామం అరకు వ్యాలీ మండలం, గొల్లూరు వీరాస్వామి, బొండం గ్రామం చెందిన ఇద్దరు ముద్దాయిలు కలిపి 20 కిలోలు గంజాయి తరలించినట్లు రుజువైనందున ఈ శిక్ష విధించినట్లు తెలిపారు. అయితే గంజాయి అక్రమంగా తరలించినట్లయితే ఈ విధమైన శిక్ష పడుతుందని శిక్ష పడుతుంది అని కనుక ప్రతి ఒక్కరు గంజాయి జోలికి వెళ్ళవద్దని శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్యంగా యువత వారి జీవితాలు పాడు చేసుకోవద్దని అన్నారు.

కోరంలేక మూడోసారి పీసా ఎన్నిక వాయిదా : ఎన్నికల అధికారి విశ్వనాథ్

విశాలాంధ్ర-గంగవరం : మండల కేంద్రమైన గంగవరం గ్రామంలో పీసా ఎన్నిక మూడోసారి కూడా వారం సరిపోకపోవడంతో వాయిదా వేసినట్లు మండల వ్యవసాయాధికారి, ఎన్నికల అధికారి కే విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పోటీలో నిలబడటం వలన,ఎన్నిక అనివార్యం ఐన నేపథ్యంలో కోరంలేని కారణంగా, ఎలక్షన్స్ నియమావలి ని అనుసరించి, పెసా ఎన్నికను వాయిదా వేయడం జరిగిందని ఆయన తెలిపారు.తదుపరి, ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు గ్రామ సభ ఎప్పుడు అనేది నోటీసు, టామ్ టామ్ ద్వారా తెలియజేయడం జరుగుతుందని ఎన్నికల అధికారి విశ్వనాథ్ తెలిపారు.

త్వరలో పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్ : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : నీతి ఆయోగ్ ప్రకటించిన ర్యాంకింగుల్లో ఆశావహ (ఆస్పిరేషనల్) జిల్లాగా పార్వతీపురం నిలిచినందున రూ.3 కోట్లు నిధులు విడుదలయ్యాయని, ఆ నిధులతో త్వరలో పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్ ను నిర్మించుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ విద్యార్థులకు తెలిపారు. ఈ హబ్ లో ఫిజిక్స్, మ్యాథ్స్, ప్లానిటోరియం వంటివి రాబోతున్నాయని తప్పకుండా విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక డివివిఎం స్కూల్ ఆవరణలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శన ముగింపు కార్యక్రమం విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పాఠశాల విద్యార్థులు రూపకల్పన చేసిన సృజనాత్మక విజ్ఞాన ప్రదర్శనలను కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా వ్యవస్థ చాలా బాగుందని, పదవ తరగతి ఉత్తీర్ణతలో గత రెండేళ్లుగా జిల్లా రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలిచిందని, ఈసారి కూడా ముందంజలో ఉండాలని కోరారు. ప్రథమ స్థానంలో జిల్లాను నిలిపేందుకు కృషిచేసిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. తనకు ఫిజిక్స్ అంటే చాలా ఇష్టమని, ఉపాధ్యాయ వృత్తిలో కూడా తాను ఫిజిక్స్ బోధించినట్లు గుర్తుచేశారు. ప్రపంచంలో అన్నీ సైన్స్ తోనే ముడిపడి ఉన్నాయని, ప్రశ్నించే తత్వంతోనే సైన్స్ మొదలవుతుందని గుర్తుచేశారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవాటుగా చేసుకోవాలని, సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని చెప్పారు. సైన్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీలపై పట్టు సాధించాలని, దీనివల్ల సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం దేశంలో సైంటిస్టుల కొరత ఉందని చెప్పారని అందుకే రేపటితరం సైంటిస్టులుగా మారాలని పిలుపు నిచ్చారు. ప్రతి విద్యార్థి సృజనాత్మకత్మకంగా ఆలోచన చేయగలిగితే తప్పకుండా సైంటిస్టులు కావచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ అభిలషించారు. అనంతరం మూడు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్న విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనల రూపకర్తలకు, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ జ్ఞాపిక, సర్టిఫికెట్లను బహూకరించారు. అలాగే జ్యూరీ మెంబర్లయిన జి. రాజు, జి. శ్రీనివాస్, కె.సూర్యారావు, ఎల్. రామకృష్ణ, ఎం.రామకృష్ణలకు కలెక్టర్ దుస్సాలువ జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. జిల్లా విద్యాశాఖాధికారి డా. ఎన్. తిరుపతి నాయుడు మాట్లాడుతూ డిసెంబరు 31న మండల స్థాయిలో విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించి, మూడు విభాగాల్లో ప్రదర్శనలు ఎంపికచేయడం జరిగిందని, అందులో 15 మండలాలకు చెందిన 45ఉత్తమ ప్రదర్శనలను ఇక్కడ ఏర్పాటుచేసినట్లు వివరించారు. జిల్లాలో 26 అటల్ ల్యాబ్స్ ఉన్నాయని, వాటి ద్వారా 40 ప్రోజెక్టులను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. జిల్లాస్థాయిలో మూడు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్న ప్రదర్శన లను రాష్ట్ర స్థాయికి పంపడం జరుగు తుందని కలెక్టరుకు వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయాధికారి ఆర్. తేజేశ్వర రావు, ఉప విద్యాశాఖ అధికారులు డి. రాజకుమార్, పి. కృష్ణమూర్తి, మోహన రావు నాయుడు, డిసిసిబి సెక్రటరీ పి.సి శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు ఎం. రమాజ్యోతి, పి.దామోదరరావు, స్థానిక కౌన్సిలర్ బడే వెంకటినాయుడు, డివివిఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. గోవిందరావు, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ప్రశాంతంగా పీసా ఎన్నికలు

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : గురువారం మండలంలో షెడ్యూల్ ప్రాంతాలకు పొడిగింపు (పెసా) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ మండలంలో పెసా ఎన్నికలు వర్తించిన గోర్లి, పాంద్రసింగి కొండ చిలకం, ద్రాక్షణి, బల్లేరు, కొండనిడగల్లు గ్రామాలలో ఈ పెసా ఎన్నికలు జరిగాయి. కాగా ఈ ఎన్నికలలో 860 మంది పురుషులు, 934 మంది స్త్రీలు, ఒక ట్రాన్స్ జెండర్ ఈ గ్రామాల పరిధిలో ఓటర్లుగా ఉన్నారు. అన్నిచోట్ల ఎన్నిక ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగినట్లు ఎంపిడిఓ శంబంగి రమేష్ తెలిపారు. గురువారం ఆయన ఎన్నికల జరిగిన గ్రామాలలో పర్యటించారు. ఈ గ్రామసభ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా గోర్లి గ్రామానికి మండల ఇంజనీరింగ్ అధికారి ఎం.పార్థసాయి పాంద్రసింగి గ్రామానికి మండల ఆర్డబ్ల్యూఎస్ అధికారి వై.భరత్‌చంద్ర కొండచిలకాం గ్రామానికి మండల తహసీల్దార్ రెడ్డి పకీరు, ద్రాక్షణి గ్రామానికి మండల పరిషత్ సూపరిండెంట్ కె.రామారావు బల్లేరు గ్రామానికి మండల విద్యాశాఖ అధికారి 2 ముదిలి శ్రీనివాసరావు కొండనిడగల్లు గ్రామానికి గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు కెవిఎస్ కుమార్ ఎన్నికల విధులను నిర్వర్తించారు.

రహదారులకు మహర్దశ : ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

విశాలాంధ్ర-బలిజిపేట : కూటమి ప్రభుత్వం వచ్చాక రహదారులకు మహర్దశ కల్పించినట్లు ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. బలిజిపేట మండలంలో గళావిల్లి నుంచి కొత్త గళావిల్లి వరకు 200 లక్షల రూపాయలతో తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ పాలనలో గత ఐదేళ్ళ గ్రామీణ రహదారులు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మట్టిరోడ్లతో వెనుకబడి నియోజకవర్గం వెనుకబడి ఉందని దీనిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. గతంలో నాయకులు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇస్తామంటే వద్దు మాకు ఏదైనా ఇవ్వండి అనే వారు ఉండేవారిని ఇది వాస్తవమని అందుకే నియోజకవర్గ అభివృద్ధికి దూరమైందిని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తున్నామని వివరించారు. రాష్ట్ర మంత్రులను నియోజకవర్గానికి తీసుకువచ్చి పరిస్థితి వివరించి అవసరమైన నిధులను మంజూరు చేయించి శంకుస్థాపన చేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేయడమే తన అభిమతమని ఎమ్మెల్యే విజయ్ చంద్ర వివరించారు. గతంలో నాయకులు ఎలా ఉన్నారు అన్నది అనవసరమని భవిష్యత్తులో నియోజకవర్గంలో అభివృద్ధి ఫలాలు అందించడమే తన ధ్యేయమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎంపీటీసీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పింక్ వేణు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి ప్రాథమిక కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి తనిఖీ

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ భాస్కరరావు గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీచేశారు. పీహెచ్‌సి పనితీరు, ఈహెచ్‌ఆర్ డేటా ఎంట్రీ, స్టాఫ్ ఎఫ్ఆర్ఎస్ హాజరును తనిఖీ చేశారు. తరువాత లేబర్ రూంను తనిఖీచేసి ప్రసవాలు గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత పిల్లలకు వేస్తున్న టీకాలను తనిఖీ చేశారు. ఆసుపత్రి వచ్చే రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలుగూర్చి అడిగి తెలుసు కున్నారు. ఆసుపత్రిలో అందజేస్తున్న అన్ని కార్యక్రమాల పైన వైద్యాధికారి వర్మతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మంతిని వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రవికుమార్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జననం (1831 జనవరి 3-మరణం 1897 మార్చి 10) భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి అని అన్నారు. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి అని అన్నారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్య పడుతుందని నమ్మిన ఆమె, తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారం భించింది. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వ సించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసింది గొప్ప వ్యక్తి అని అన్నారు. సమాజంలోని కులతత్వం, పురుషాధిక్య ధోరణులు కలిగిన చాలామంది పండిత మేధావులందరికీ కూడా ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి. సావిత్రిబాయి ఆశయాలతో విద్యార్థినిలు ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల నాయకులు నిర్వహించిన ఎస్సై రైటింగ్స్ కు మొదటి మూడు స్థానాలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐవిఎఫ్ & ఫెర్టిలిటీ క్లినిక్‌ను వైద్య బృందం తనిఖీ

విశాలాంధ్ర-బెలగాం : ప్రయివేటు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో బాగంగా పట్టణంలో కొత్తగా ప్రారంభించిన కుటుంబ ఐవిఎఫ్ & ఫెర్టిలిటీ క్లినిక్‌ను వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు శుక్రవారం వైద్య బృందంతో కలిసి తనిఖీ చేశారు. ఆరోగ్య శాఖ నిర్దేశించిన ప్రమాణాలు, చెక్ లిస్ట్ ప్రకారం ఉండాల్సిన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల నిర్వహణ తీరు పరిశీలించారు. ఆసుపత్రి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవసరమైన అర్హతా పత్రాలు, సర్టిఫికెట్లు, డాక్యుమెంట్స్ తనిఖీ చేశారు. క్లినిక్ లో తనిఖీలకు అవసరమైన పరికరాల లభ్యత రికార్డుల నిర్వహణ పరిశీలించారు. బయోమెడికల్ వ్యర్థ నిర్వహణ ఏర్పాట్లు, టాయిలెట్ల నిర్వహణ పరిశీలించారు. ఆరోగ్య అంశాలకు సంబంధించి గోడ పత్రికలను ప్రదర్శించాలని సూచించారు. రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడి ఆరోగ్య పరీక్షలకు వచ్చిన వారి పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణ, పరిశుభ్రత తీరు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ యాళ్ల వివేక్, జిల్లా ఆరోగ్య కార్యాలయ డిప్యూటీ డెమోలు వై.యోగీశ్వరరెడ్డి, వి.సన్యాసిరావు, ఈఓ సత్తిబాబు తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబాలకు పి.ఎం.జె పథకం కింద ఒక్కొక్కరికి రూ.2 లక్షలు

విశాలాంధ్ర-పాచిపెంట : మండలంలో కోస్ట్ వలస గ్రామానికి చెందిన సోడి గింజల గైరమ్మ మృతిచెందగా ఆయన భర్త (నామిని) బోదయ్యకు, పాచిపెంట మండలం పాచిపంట గ్రామానికి చెందిన మహాదేవ్ చిన్న మృతిచెందగా నామిని అయిన రమణకు శుక్రవారం ఏపీ జి.వి.బ్యాంకు మేనేజర్ పి.సునీల్ రెండు లక్షలు చెక్కును ఒక్కొక్కరికి అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో ఎకౌంట్లో ఉన్న 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాలలోపు ఖాతాదారులు పీఎంజే బి.వై.(ఇన్సూరెన్స్) ఏడాదికి సుమారుగా 400 రూపాయలు బ్యాంకు ద్వారా ఇన్సూరెన్స్ చేసుకున్నట్లయితే ఎకౌంటుదారులు ఎవరైనా అకస్మాత్తుగా మృతి చెందినట్లయితే వారి కుటుంబ సభ్యుల పేరున నామిని ఎకౌంట్కి రెండు లక్షల రూపాయలు బీమా వర్తిస్తుందని ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ పి.సునీల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సీసీలు రామకృష్ణారావు పోలీసు రావు సిబ్బంది పాల్గొన్నారు.

నీతిఆయోగ్ అభివృద్ధి పనులు వేగవంతం

విశాలాంధ్ర-పార్వతీపురం : నీతి అయోగ్ సంయుక్త కార్యదర్శి కె.ఎస్ రాజీమన్ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ఆశావహ జిల్లాగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రణాళికపై వివరంగా సంయుక్త కార్యదర్శితో చర్చించారు. ఆశావహ జిల్లాలో భాగంగా ఏర్పాటు చేయనున్న స్కిల్ హబ్ సెంటర్, గ్రామ విజ్ఞాన కేంద్రాల వివరాలను తెలిపారు. జిల్లా అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్న విధానానికి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు.

అధికమొత్తంలో సభ్యత్వ నమోదు అందరి లక్ష్యం కావాలి

తెదేపా రాష్ట్ర కార్యదర్శి వీరేష్ దేవ్

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం నియోజకవర్గంలో అధిక మొత్తంలో సభ్యత్వ నమోదు అందరి నాయకులు కూ ఏకైక లక్ష్యం కావాలని, ఐకమత్యంతో కూటమి ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకుని వెళ్ళాలని తెలుగుదేశం పార్టి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ సూచించారు. శుక్రవారం కురుపాం కోటలో నూతన సంవత్సర సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి విరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు మరియు కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భవిష్యత్ కార్యాచరణ మరియు ప్రణాళికలు గూర్చి నాయకులు కార్యకర్తలుకు దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ వివిధ హెూదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జైపాల్ సింగ్ ముండా జయంతి వేడుకలు

విశాలాంధ్ర-దేవీపట్నం : రాజ్యాంగసభ సభ్యుడు ఆదివాసి మహాసభ వ్యవస్థాపకులు జైపాల్ సింగ్ ముండా జయంతి వేడుకలు దేవీపట్నం మండలం ఇందుకూరు గ్రామంలో శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివాసి మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ, ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజుల్లా రంపచోడ వరం నియోజకవర్గం దేవీపట్నం మండలం ఇందుకూరు రెవెన్యూ గ్రామంలోని యలగాడ నాగేశ్వరరావు ఇంటి ప్రాంగణంలో భారత రాజ్యాంగసభ సభ్యుడు ఆదివాసి మహాసభ వ్యవస్థాపకులు జైపాల్ సింగ్ ముండా 122వ జయంతి వేడుకలు సందర్భంగా ఘనంగా పూలమాలలతో నివాళులర్పించామన్నారు. జైపాల్ సింగ్ ముండా విద్యావేత్తగా, క్రీడాకారునిగా, ఉద్యమకారునిగా, రాజకీయ నాయకునిగా, భారత రాజ్యాంగసభ సభ్యునిగా జీవితాంతం ఆదివాసుల హక్కుల కోసం పోరాడి వారి హక్కులు భారత రాజ్యాంగంలో చేర్పించిన బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆదివాసి మహాసభ వ్యవస్థాపకులు జైపాల్ సింగ్ ముండా అన్నారు.ఆయన ఉద్యమ పోరాట స్ఫూర్తి నేటి తరం యువతీ యువకులకు ఆదర్శనీయ మన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్వాసితులకు కొత్త భూ సేకరణ చట్టం ప్రకారం సెక్షన్ 42(3) ప్రకారం ముంపు గ్రామాల్లోని సుమారు 50వేల ఎకరాల వన సంరక్షణ సమితి భూములకు పరిహారం చెల్లించాలి. రూల్ 24 ప్రకారం ముంపు గ్రామాలకు చెందిన భూమిలేని ఎస్సీ ఎస్టీలకు ఒక్కొక్కరికి కనీసం ఎకరం భూమి అందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలి. రాష్ట్ర ప్రభుత్వం 2021లో జారీ చేసిన జీవో.ఆర్ నెం.224 ప్రకారం ఒక్కొక్క నిర్వాసితునికి పది లక్షల రూపాయలు చెల్లించాలి.నాలుగు సంవత్సరాలు గడిచిన ఏ ఒక్కరికి ఈ మేరకు పది లక్షల రూపాయలు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించలేదన్నారు.భూసేకరణ నోటిఫికేషన్లు కాలదోషం పట్టాయి. ఆర్ అండ్ ఆర్ కాలనీలోకి నిర్వాసితులు వెళ్లే రోజే 18 సంవత్సరాల వారికి ప్యాకేజీ కటాఫ్ డేట్గా పరిగణించాలి. కొత్త భూసేకరణ చట్టం ప్రకారం సబ్ రిజిష్టర్ విలువకు మూడు రెట్లు అదనంగా అనగా ఎకరానికి 36 లక్షలు భూపరిహారం చెల్లించాలి. ఆర్అండ్ఆర్ కాలనీలకు చట్టంలో పేర్కొన్న 25 సౌకర్యాలు కల్పించాలి. అలాగే పోలవరం నిర్వాసితుల సమస్యలపై కొత్త చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆదివాసి మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు,ఆదివాసి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, ఆదివాసి మహాసభ కన్వీనర్ అరగాటి వీరభద్ర రెడ్డి, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి,చెదల నాగిరెడ్డి, కెచ్చేల అబ్బాయి రెడ్డి,మామిడి చిన్నారెడ్డి, పూనెం విష్ణు,మడకం చంద్రరావు, గడుతూరి చిన్నారావు,ముర్రం పెంటన్న దొర,బిజెపి సోషల్ మీడియా కార్యదర్శి నడిపూడి భాను శంకర్ రెడ్డి, మడకం శంకరమ్మ, నడిపూడి గాంధీ రెడ్డి, మద్దేటి సతీష్, సింబోతుల దుర్గాప్రసాద్ మొదలైన వారు పాల్గొన్నారు.

సంతాప దినాల చివరిరోజు మన్మోహన్ సింగ్‌కి ఘన నివాళి

విశాలాంధ్ర-సాలూరు : మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ మృతితో దేశవ్యాప్తంగా 7 రోజులుపాటు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సంతాప దినాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంఛార్జ్ గేదెల రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ సేవలను కొనియాడారు. కుదేలైన భారత ఆర్థిక వ్యవస్థను ఆర్థిక మంత్రిగా గాడిలో పెట్టిన సంస్కరణ రూపశిల్పి అన్నారు. ప్రధానిగా ప్రభుత్వాన్ని ప్రగతిపథంలో పరుగులు తీయించిన రాజనీతిజ్ఞుడని ప్రశంసించారు. పేదలకొరకు అనేక సంస్కరణలు, సంక్షేమ పథకాలను అమలుజరిపిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, నియోజకవర్గ బిసి సెప్ అధ్యక్షుడు సిగడాపు బంగారయ్య, మాజీ కౌన్సిలర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ద్వారపురెడ్డి పుండరీకాక్షనాయుడు, అక్కాన అప్పారావు, దాసరి భాస్కరరావు, అల్లు రామినాయుడు, రావుపల్లి శ్రీనివాసరావు, యర్ర గోవింద, రీసురాము తదితరులు పాల్గొన్నారు.

టెండరు దశలో వైద్య కళాశాల పనులు... శరవేగంగా సాలూరు ఆసుపత్రి పనులు

స్పష్టం చేసిన ఎపిఎంఎస్ఐడిసి ఈఈ శ్రీనివాసమూర్తి

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాల పనులు టెండరు దశలో ఉన్నాయని, సాలూరులోని వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎపిఎంఎస్ఐడిసి కార్యనిర్వాహక ఇంజినీరు ఎం. శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి పూర్తిచేసేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు శుక్రవారం జారీచేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. పార్వతీపురంలో 100 నుంచి 150 పడకల స్థాయి పెంపుకు సంబంధించిన పనులు శరవేగంతో జరుగుతున్నట్లు తెలిపారు. పార్వతీపురం, సీతంపేట నందు రూ.50 కోట్ల చొప్పున సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు శరవేగంతో అవుతున్నాయని, ప్రభుత్వ వైద్య కళాశాల పనుల కోసం మంగళగిరిలోని ఎపిఎంఎస్ఐడిసి ప్రధాన కార్యాలయం నందు టెండర్ దశలో వున్నట్లు చెప్పారు. అలాగే సాలూరులో 30 నుంచి 100 పడకల ఆసుపత్రిగా ఆధునీకరణ చేయుటకు రూ.17.00 కోట్లు నాబార్డ్ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గతంలో గుత్తేదారుకు చెల్లించాల్సిన బకాయిలను ఈ ప్రభుత్వం చెల్లించినందున పనులు శరవేగంగా జరుగుచున్నాయని అంతేకాకుండా ఈ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు రూ.3.00 కోట్ల విలువ గల పనులను పూర్తిచేయడం జరిగిందని, మిగిలిన పనులను ఈ ఏడాది మార్చి 31లోగా పూర్తి చేయుటకు తగు చర్యలు తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించారు. దీన్ని పూర్తిచేసి ఆసుపత్రి పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులో తీసుకువచ్చేందుకు తగు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.

అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

శాసనసభ్యులు బోనెల విజయచంద్ర

విశాలాంధ్ర-బెలగాం : విద్యార్థులు తలచుకుంటే ఎన్నో అద్భుతాలు సృష్టించగలరని, అటువంటి వాటికి నాంది పలికి అంతర్జాతీయ శాస్త్రవేత్తలుగా జిల్లా విద్యార్థులు ఎదగాలని పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయచంద్ర అభిలషించారు. శుక్రవారం పట్టణంలోని చర్చివీధి డివివిఎం స్కూల్ ఆవరణలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు విజయ్ చంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని సెల్ ఫోన్ ద్వారా జ్యోతి ప్రజ్వలన చేసి, సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ చంద్ర మాట్లాడుతూ సదరన్ ఇండియా సైన్స్ ఫెస్ట్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందని, ఇటువంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల్లో ఉండే ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని, విద్యార్థులను ఇంజినీర్లుగా, వైద్యులుగా, శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రపంచంలోని ప్రతీది సైన్స్ పైనే ఆధారపడి ఉందని, అరచేతిలో ప్రపంచవ్యాప్త సమాచారం మన ముందున్న సంగతిని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని తెలిపారు. జిల్లాలో ఇంకా మూఢ నమ్మకాలు ఉన్నాయని, వాటిని విడనాడి విజ్ఞానాన్ని నమ్ముకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మన ఇంజినీర్లు, వైద్యులు ప్రపంచ దశా దిశనే మారుస్తున్నారని, ఆ దిశగా జిల్లా విద్యార్థులు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. రాబోయే తరాలు వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రాకు దోహదపడాలని, దేశానికి జిల్లా విద్యార్థులు అంబాసిడర్లుగాను, సైంటిస్టులు గాను ఎదిగి మార్స్ నే జయించాలని కోరారు. పదవ తరగతి ఉత్తీర్ణతలో జిల్లాను గత రెండేళ్లుగా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపారని, అలాగే ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోగలిగితే శాస్త్రవేత్తల్లో కూడా మన జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం సాధ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటువంటి విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా కొత్తదనం తెలుసుకొని, మీలోని ప్రతిభా పాటవాలను వెలికితీయాలని అన్నారు. ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదని, మీలో ఉన్న ప్రతిభకు మీరే కారకులన్న సంగతిని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని, మీరు చేసే అద్భుతాలే ప్రపంచస్థాయిలో గుర్తింపునిస్తాయని తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా నిర్వహించిన వివిధ పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లా పేరు మారుమ్రోగిందని, ఇటువంటి ప్రదర్శనల ద్వారా మరింత ముందుకు వెళ్లాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఇటువంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించిన ఆయన అనంతరం ఆవరణలో ఏర్పాటుచేసిన 15 మండలాలకు చెందిన 45 విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డా. ఎన్. తిరుపతినాయుడు మాట్లాడుతూ డిసెంబరు 31న మండల స్థాయిలో విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించి, మూడు కేటగిరీల్లో ప్రదర్శనలు ఎంపికచేయడం జరిగిందని, అందులోని 15 మండలాలకు చెందిన 45 ఉత్తమ ప్రదర్శనలను ఇక్కడ ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో 26 అటల్ ల్యాబ్స్ ఉన్నాయని, వాటి ద్వారా 40 ప్రోజెక్టులను ఎంపికచేయడం జరిగిందని తెలిపారు. దేశంలోని శాస్త్రవేత్తల జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేసి, వారిలో స్ఫూర్తిని నింపి తద్వారా వారిని శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనల ఉద్దేశ్యమని అన్నారు. భావితరానికి సైంటిస్టులను అందించేందుకు ఇటువంటి సైన్స్ ఫెయిర్లు దోహదపడతాయని, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష అదనపు పథక సమన్వయాధికారి ఆర్.తేజేశ్వరరావు, ఉప విద్యాశాఖాధికారులు డి.రాజ్‌కుమార్, పి.కృష్ణమూర్తి, డిసిసిబి సెక్రటరీ పి.సి శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు ఎం. రమాజ్యోతి, పి.దామోదరరావు, స్థానిక కౌన్సిలర్ బడే వెంకటినాయుడు, డివివిఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర-కురుపాం : సావిత్రి బాయ్ పూలే మహిళా ఉపాధ్యాయులుకు ఆదర్శం కావాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట శంకర్రావు కోరారు. జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోసావిత్రిబాయ్ పూలే చిత్రపఠానికిపూలంకరణ చేసి ఆమె సేవలు కొనియాడారు. మహిళా ఉపాధ్యాయులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఆరంగి రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో గల మహిళా ఉపాధ్యాయినులకు జ్ఞాపికలు అందజేశారు.

చింతలవీధి అక్రమ నిర్మాణాలపై కూల్చివేత ఆలస్యం ఎందుకు..?

- అధికారులు భయపడ్డారా..? రాజకీయ నాయకుల పలుకుబడి పని చేసిందా..?

- అధికారులు ప్రభుత్వ భూమి అని గుర్తించి మార్కింగ్ వేసిన కూడా ఆగడం వెనక అంతర్యం ఏమిటి..!

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి జిల్లా పాడేరు కేంద్రానికి కూతవేటి దూరంలో ఉన్న చింతల వీధి పంచాయతీ కేంద్రంలో ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన నిర్మాణదారులకు అధికారులు మీరు నిర్మించుకున్న స్థలం ప్రభుత్వా స్థలం అని నోటీసులు జారీ చేసి నెలలు వ్యవధి గడుస్తున్న దానిపై అధికారులు గుప్ చాప్పు కావడం వెనక అంతర్యం ఏమిటని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారుల కనుసన్నలో గిరిజనేతరులు యదేచ్చగా భారీ భవంతులు వ్యాపార సముదాయా(దుకాణాల) నిర్మాణాలు జోరుగా కొనసాగిస్తున్నారు. చింతల వీధి పంచాయతీలో పూర్తిగా 1/ 70 చట్టాన్ని అతిక్రమిస్తూ రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి గిరిజనేతరులతో కుమ్మకై రహదారికి ఇరువైపులా ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. అడ్డుకట్ట వేయాల్సిన రెవెన్యూ అధికారులు అమ్ముడు పోయారు. వీటన్నిటికీ మూల కారణం గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారుల కనుసన్నలలో జరగడమేనని పలు ప్రజా సంఘాలు ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ గ్రామ పంచాయితీ తీర్మానం లేకుండా, రెవెన్యూ ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలలోనే గిరిజనేతరులు రెవెన్యూ అధికారులఅండదండలతో బినామీ పేర్లతో నిర్మాణాలు కొనసాగించారని ఆరోపణలు లేకపోలేదు. అలాగే నిర్మాణదారుల నుండి అధిక మొత్తంలో అక్రమ వసూలు చేసినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.ప్రధాన రహదారికి ఇరువైపులా కొంత ప్రభుత్వ స్థలాలు, పంట పొలాలలో వున్నాయి. ముందుగా పంట పొలాలకు తప్పనిసరిగా గ్రామ తీర్మానం, ల్యాండ్ కన్వర్షన్ చేయాల్సి ఉన్నపటికీ అదేమీ చేయకుండానే వ్యాపార సముదాయాలు నిర్మాణానికి దొడ్డి దారిలో అనుమతులను తెచ్చి పెద్ద పెద్ద భవనాలు, వ్యాపార సముదాయాలు నిర్మాణాలు జరిపేందుకు రెవెన్యూ అధికారులు సహరిస్తున్నారు. అంటే ఎంత బరితెగించారో అట్టే అర్థమవుతుంది. అంతేకాకుండా వాస్తవానికి ఇక్కడ నిర్మాణాలకు విద్యుత్ మీలర్లకు అధిక మొత్తంలో సొమ్ము తీసుకొని అనుమతులు ఇస్తూ విద్యుత్ మీటర్లు రావడానికి కూడా సహాయ సహకారాలు అందజేస్తురంటే ఏమనుకోవాలి. గుట్టుచప్పుడు కాకుండా చేతివాటం ప్రదర్శిస్తురనేది నగ్న సత్యం. పంచాయితీ సర్పంచ్ మహిళకవడంతో, నిరక్ష్యరాసి రావడంతో ఎటువంటి సిఫారసు లేకుండా పంచాయతీ రెవెన్యూ అధికారులు అధికారాన్ని తమ చేతిలో తీసుకొని ఆడిందే ఆట పాడిందే పాట అనట్లు అంత వారై ఇష్టానుసారంగా నిర్మాణలు చేయిస్తూ గ్రామపంచాయతీ, శైలిలో వెళ్తూ అందిన కాడికి ఆమెకు తెలియ కుండానే అనుమతులు ఇచ్చి దగ్గరుండి రెవెన్యూ అధికారులు తమ దైన దోచుకుంటూ అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడంతో రెచ్చిపోయిన గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేసారు చేస్తున్నారు. కొంతమంది గిరిజనేతరులకు ఎవరు నిర్మిస్తున్నారని అడిగితే మేమే నిర్మిస్తున్నామని, పంచాయతీ, రెవెన్యూ అధికారుల అనుమతులు తీసుకొనే నిర్మాణాలు చేస్తున్నా మని, సమాధానం చెప్పడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. విచిత్రం ఏమిటంటే మీకేమై నా వివరాలు కావాలంటే పంచాయతీ, రెవెన్యూ అధికారులకు అడిగి తెలుసుకోవచ్చునిచెప్పడం కొనమెరుపు. అంటే గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారులు ఎంత బరితెగించారో దీనిని బట్టి అర్థమవుతుంది. ఇటువంటి రెవెన్యూ అధికారుల వల్ల గిరిజనుల హక్కులు, చట్టాలకు, గిరిజనుల గుండె కాయ లాంటి 1/70 చట్టం కనుమరుగై పోయే ప్రమాదం లేకపోలేదని పలువురు బహిరంగా వంచాయతీ, రెవిన్యూ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఒక మాటలో చెప్పాలంటే అల్లూరి సీతారామ రాజు జిల్లా లోఅడపా దడపా అక్కడక్కడ 1/70 చట్టం అమలులో ఉందనే భయంతో కొంతమంది గిరిజనేతరులు భయపడుతు గిరిజనుల పేరిట బినామీ పేర్లతో ఇల్లు, భావనలు, వ్యాపార సముదాయాలు నిర్మాణాలు నిర్మించి ఉంటే వుండచ్చునేమే కానీ పాడేరు మండలం చింతలవీధి పంచాయతీలో మాత్రం ఇందుకు విరుద్ధంగా 1/70 చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని గిరిజనేతరులతో కుమ్మక్కై చేతినిండా కానులు తీసుకొని చట్టాన్ని కూని చేసారనడంలో ఎటువంటి సందేహమే లేదనీ చెప్పవచ్చు. అయితే ల్యాండ్ మార్కింగ్ వేసి నోటీసులు జారీచేసి దాన్ని కూల్చకపోవడంపై అధికారులు భయ పడ్డారా..? అమ్ముడు పోయారా? రాజకీయ ఒత్తిళ్లకు తలగ్గారా? లేక గిరిజన ప్రాంత హక్కులు చట్టాలు ఏమైతే మాకేంటి అని సైలెంట్ అయిపోయారా? అనేదానిపై ప్రజలు చర్చించుకుంటున్నారు. చింతలవీధి అక్రమ నిర్మాణాలపై అధికారులు ఏం తేలుస్తారో వేచి చూద్దాం.

బత్తుల లక్ష్మి కాంతమ్మ దహన సంస్కారాలకు ఎమ్మెల్యే శిరీష దేవి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఎటపాక : అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎటపాక మండలం కుసుమనపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి గుండెపోటుతో బత్తుల లక్ష్మీ కాంతమ్మ మరణించారు.వారిది నిరుపేద కుటుంబం ఈ విషయాన్ని చింతూరు డివిజన్ పాస్టర్స్ చైర్మన్ పాస్టర్ ఉయిక పీటర్ సింగయ్య రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ,విజయ భాస్కర్ లకు దృష్టికీ వారి సమస్య తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి దహన సంస్కారాలకు 5000 రూపాయలు పంపించారు.ఆ ఆర్థిక సహాయాన్ని పాస్టర్ ఉయిక పీటర్ సింగయ్య చేతులమీదుగా నగదును కూతురు బత్తుల నాగమణికి అందజేశారు.ఈ సందర్భంగా ఉయిక పిటర్ సింగయ్య మాట్లాడుతూ బత్తుల లక్ష్మి కాంతమ్మ కుటుంబం నీరు పేద కుటుంబం అని,ఆమె గురువారం రాత్రి గుండె పోటుతో మరణించారని, ఆమె ఆర్థిక పరిస్థితిలను రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవికి,తెలుగు యువత నాయకులు మట్టం భాస్కర్ కి తెలియజేయసారని వారు వెంటనే స్పందించి అంత్యక్రియలకు తక్షణ సహాయం కింద 5000వేల రూపాయలు పంపించడం జరిగింది అని వారికీ బత్తుల లక్ష్మి కాంతమ్మ కుటుంబం తరుపున, చింతూరు డివిజన్ పాస్టర్స్ తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నారు.

ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని సమిష్టిగా ప్రశ్నిద్దాం

అరకు ఎంపీ, పాడేరు ఎమ్మెల్యే, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు పిలుపు

విశాలాంధ్ర-చింతపల్లి : ఐకమత్యమే బలమన్న సూక్తిని అనుసరించి వైకాపా ప్రజా ప్రతినిధులు అందరూ సమిష్టిగా ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలు నెరవేర్చే దిశగా ప్రజల పక్షాన నిలిచి పోరాడేందుకు సమిష్టి నిర్ణయాలతో ముందుకు సాగాలని అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజా రాణి, పాడేరు శాసనసభ్యుడు మత్యరాస విశ్వేశ్వర రాజు, ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, పాడేరు మాజీ శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి లు అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి, సర్పంచ్ దురియా పుష్పలత, చౌడు పల్లి ఎంపీటీసీ సభ్యురాలు ఎల్ మీనాకుమారి లు వారిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024లో ఎన్నో విపత్కర పరిస్థితులను వైకాపా ప్రభుత్వమే గాక రాష్ట్ర ప్రజలందరూ చవిచూశా రన్నారు. అల్ప పీడనాల వలన కలిగిన చేదు అనుభవాలతో పాటు, గత ఏడాదిలో జరిగిన ఎన్నికలలో ఎన్డీయే కూటమి పార్టీల మోస పూరిత హామీలతో రాష్ట్రమంతా కూటమి మాయలో పడినప్పటికీ మన్య ప్రాంతంలోని గిరిజన ప్రజానీకం అంతా వైకాపాకు అండగా ఉన్న విషయాన్ని ఏనాడు మరవరాదన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వైకాపా నాయకుడు ముత్తా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వెంటనే ప్రారంభించాలి

బీకెఎమ్‌యూ జిల్లా సమావేశం
గరుగుబిల్లి సూరయ్య, బీ.మోహన్ పిలుపు
ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

విశాలాంధ్ర-కురుపాం : పేదలకు ఇల్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం పనులు వెంటనే కల్పించాలని, ఇతర ప్రధానమైన డిమాండ్లు పరిష్కరించాలని బీ కె ఎమ్ యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, బీ. మోహన్, గరుగుబిల్లి సూరయ్య లు డిమాండ్ చేశారు. కురుపాం పాత బస్టాండ్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల మీటింగ్ బీ మోహన్ అధ్యక్షతన సమావేశం జరిగింది, ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి, రోజువారి కూలి రూ. 500లు ఇవ్వాలని, పని ప్రదేశంలో నీరు, నీడ, అత్యవసర చికిత్స మెడికల్ కిట్టు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, కొత్త జాబ్ కార్డులు మంజూరుచేయాలని, ఒక పూట మాత్రమే పనులు చేయించి, క్యూబిక్ మీటర్ ధర పెంచాలని వ్యవసాయ కార్మికులకు రక్షణ కోసం సమగ్ర చట్టం తక్షణం తేవాలని, పేదలకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని,కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి, కొత్త పెన్షన్ మంజూరు చేయాలని అన్నారు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ మాట్లాడుతూ కోనే రంగారావు భూ కమిటీ సిఫారసుల అమలు చేయాలి, రాష్ట్రంలో సాగు భూముల సమస్యలు రోజురోజుకీ ఎక్కువ అవుతున్నాయి, ప్రభుత్వ భూములు (బంజర్లు, గయా భూములు)అధికార పార్టీల పెద్దలు అడ్డగోలుగా ఆక్రమించుకొని, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించునను, ప్రభుత్వ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తున్నది, కనీసం సాగు భూములు లేని నిరుపేద వ్యవసాయ కార్మికుల కుటుంబాలు పొట్టపోషణ కోసం వలసలు నిత్యం పోతున్నారు. ఒకవైపు అనర్హుల చేతిలో ఉన్న భూములను వెలికి తీసి పేదలకు పంచాలని ప్రభుత్వం పై వత్తిడి తెచ్చేలా, మరోవైపు భూసాధన కోసం వ్యవసాయ కార్మిక సంఘం పేదలతో కలిసి ప్రత్యక్ష భూ పోరాటాలు నిర్వహిస్తున్నది, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసు అమలు కోసం ఉద్యమిస్తున్నది. ఎన్నికల ముందు పేదల ఓట్లు దండుకోవడానికి పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణములో రెండు సెంటు ఇళ్ల స్థలాల కోసం కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయల కేటాయిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అమలు చేయాలని మన బీకేఎంయూ పోరాడుతున్నది, వాటి అమలు కోసం మొదటి విడతలో నవంబర్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు కోసం, పేదల ద్వారా వ్యక్తిగత అర్జీలు ఇప్పించడం జరిగింది, మరలా రెండో విడతలో భాగంగా జనవరి 2 తేదీ నుండి 10 తేదీ వరకు గ్రామాల్లో ఇళ్ల స్థలాలు లేనటువంటి పేదలందరితో వ్యక్తిగత అర్జీలు పెట్టించే కార్యక్రమాన్ని చేపట్టి, 10వ తేదీన మండల తాసిల్దార్ కు వ్యక్తిగత అర్జీలు ఇచ్చి ఇళ్ల స్థలాలు సాధించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం %దీఖవీఖ% కార్యక్రమం ఇచ్చింది,ఇప్పటికే నిర్మాణములో" 'టిడ్కో' ఇల్లులను లబ్దిదారులకు స్వాధీన పరచాలని తదితర పేదల సమస్యలపై నిరంతరం పోరాడుతుంది బీకేఎంయూ. సామాజిక పెన్షన్లు అనర్హులు పొందుతున్నారని పేరుతో అర్హులకు అన్యాయం చేస్తే సహించేది లేదు, దళితులు, గిరిజనులు, వెనకబడిన వర్గాలకు ఇల్లు, ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణము, కూలి సమస్య,గ్రామీణ ఉపాధి, సాంఘిక సమస్యలు, దళితులపై దాడులు, గ్రామీణ ప్రాంతాలలో అంటరానితనం నిర్మూలన, సాగు భూములకు పట్టాలు మంజూరు కోసం, పేదలకు విద్యవైద్యం, ఆరోగ్యం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం, రక్షిత మంచినీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, డ్రైనేజీ తదితర సమస్యల సాధనకై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తున్నది, రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యమాల నిర్వహణ కోసం చర్చించేందుకు జరుగు మండలం, జిల్లా, రాష్ట్ర మహాసభలకు పెద్దలు దాతలు ఆర్థికంగా హార్దికంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసారు, ఈ కార్యక్రమంలో పైడిశెట్టి, పత్తిక మోహన్‌రావు, త్రినాథ్, సింగన్న తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పీసా కమిటీ ఎన్నికల ప్రశాంతం

18 చోట్ల ఏకగ్రీవం, ఐదు చోట్ల ఎన్నిక, ఏడు చోట్ల వాయిదా
ఎంపీడీవో శ్రీనివాసరావు.

విశాలాంధ్ర-చింతపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన పీసా కమిటీ ఎన్నికలకు సంబంధించి మండలంలోని 30 గ్రామాలలో ఎన్నికలు నిర్వహించవలసి ఉండగా అందులో 18 చోట్ల ఏకగ్రీవంగా ఎన్నిక నిర్వహించగా 5 గ్రామాలకు ఎన్నిక జరగగా, 7 గ్రామాలు అనగా పెదబరడ, చౌడుపల్లి, కిటుముల, గొంది పాకలు, రోలంగి, కొమ్మంగి, అంజలి శనివారం గ్రామాలలో మూడో వంతు ఓటర్లు లేనందున ఎన్నికలు వాయిదా వేయడమైనదని, వాయిదా పడిన గ్రామాలలో ఎన్నికలను ఈనెల ఏడున నిర్వహించడానికి తదుపరి షెడ్యూల్ ను త్వరలో ప్రకటించడం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే 193వ జయంతి

విశాలాంధ్ర -పార్వతీపురం టౌన్/బెలగాం : స్థానిక బెలగాం చర్చివీధిలోగల టిఆర్ఎంఎం పాఠశా లలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి మహిళా ఉపాధ్యాయులు పుష్పగుచ్చం వేసి నివాళులర్పించి ఆమె సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు డి.శోభారాణి, ఉపాధ్యాయులు ఈ.జ్యోతిలక్ష్మి, కె.భారతి, వి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆధునిక భారత మొదటితరం స్త్రీ వాద సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే అని నేడు సావిత్రి బాయి పూలే 193వ జయంతి అని పూలే దంపతులు లేని భారత దేశ చరిత్రను మనం ఊహించలేమన్నారు. దేశ సాంఘిక సంస్కరణోద్యమంలో వారి పాత్ర ఒక అద్భుతమని భారత సామాజిక నూతన ఒరవడికి మార్గం సుగమం చేయటంలో వీరి పాత్రకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉద్యమ గమనంలో ఎన్ని ఆటు పోట్లు వచ్చిన వాటిని తట్టుకుని నిలబడి ఎదురొడ్డటం నేటి తరానికి కూడా సాధ్యం అయ్యేపని కాదని, అంతటి ఖ్యాతిని గడించిన సావిత్రి బాయి పూలే కోసం నేడు మనం స్మరించుకోబోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసిరావు, నాయకులు జి. తులసి రాము, స్థానిక మహిళా సంఘం నాయకులు వి. ఇందిర పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో సీమంతం

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మడలం దారకొండ పంచాయతీ అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం గర్భిణీలకు స్థానిక అంగన్వాడీ టీచర్ యశోదమ్మ ఆధ్వర్యంలో సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం మహిళా పోలీస్ రాజేశ్వరి మాట్లాడుతూ గర్భిణీలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రసవానికి వారం రోజులు ముందుగానే ఆసుపత్రిలో జాయిన్ అవ్వాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు బాలింతలు పిల్లల తల్లులు పాల్గొన్నారు.

అడవుల్లో అగ్నిప్రమాదాలు, గంజాయి సాగు నిర్మూలనపై అవగాహన

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో సాలూరు రేంజ్ మక్కువ సెక్షను దుగ్గేరు బీటు నందు గల మూల వలస గ్రామం నందు శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ విశాఖపట్నం సర్కిల్ ఎఫ్ఆర్ఓ కే శ్రీనివాసరావు వారి సిబ్బంది, మక్కువ సెక్షన్ అధికారి కేతిరెడ్డి నారాయణరావు వారి సిబ్బందితో కలిసి అడవుల్లో నిప్పు పెట్టరాదని అదేవిధంగా గంజాయి సాగు చేయరాదని గంజాయికి బానిస కావడం వలన అనేకమంది జీవితాలు నాశనం అవుతున్నాయని వాటి వలన సంభవించే పర్య వసనాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగినది.

మరింత మెరుగుపరచాలి

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : ఆశ్రమ పాఠశాలల్లోని పరిసరాల పరిశుభ్రతను, విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని జిల్లా ఆహార భద్రత అధికారి రామయ్య జిటిడబ్ల్యూఎ హైస్కూల్ వనజ ప్రధానోపాధ్యాయులు అల్లు రవిప్రసాద్ కు సూచించారు. గురువారం రాత్రి పల్లె నిద్రలో భాగంగా పాఠశాల పరిసరాలు మరుగుదొడ్ల నిర్వహణ విద్యార్థుల మౌలిక వసతులను గూర్చి విద్యా ప్రమాణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత ఉదయం ఆయన విద్యార్థులకు అందిస్తున్న వ్యాయామాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామంలో ఆయన సందర్శించి గ్రామదర్శిని కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి అక్కడి గర్భిణీలు బాలింతలు చిన్న పిల్లలకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు.

గుప్త నిధులుకోసం త్రవ్వకాలా?

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని జీడిగుప్ప అడవుల్లో పూసివాగు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధులు కోసం త్రవ్వకాలు జరిపిన ఆనవాళ్లు కలకలం రేపుతున్నాయి. శుక్రవారం కొందరు అటుగా వెళ్లే క్రమంలో త్రవ్వ కాలు ఆనవాళ్లు చూచి మీడియాకు సమాచారం అందించారు. గోతిని తవ్వి త్రాడు మేకులుకొట్టి ఉన్నాయని అక్కడ గుప్త నిధులు కోసంపూజలు చేసిన ఆనవాళ్ల ఉన్నాయని పసుపు కుంకుమ పూసి గుమ్మడి కాయలు నిమ్మకాయలుతో పూజలు చేసి త్రవ్వి నట్టుగా ఉన్నాయనీ అన్నారు. గుప్తనిధుల కోసం గుర్తు తెలియని వారు తవ్వకాలు జరిపినట్లు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గోతివద్ద నిమ్మకాయలు, పూజ సామాగ్రి ఉండడంతో గుప్తనిధుల కోసమే తవ్వకాలు జరిగాయని పలువురు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల కాలంలో హిందూ దేవాలయాల్లో విగ్రహాలు చోరీలు జరగడం వంటి చర్యలు ఇటువంటి వారే చేస్తున్నారా అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ముఠా పై పోలీస్ వారు నిఘా పెట్టాలని చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు వెడల్పు కోసం కొలతలు

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని విఆర్ పురం రేకపల్లి ప్రధాన రహదారి వెడల్పు కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డుకు ఇరువైపులా కబ్జా (ఆక్రమణకు గురైనా) చేసిన స్థలాలు, రెవిన్యూ ఆర్.ఐ, రామకృష్ణ ఆధ్వర్యంలో మార్కింగ్ చేయడం జరిగిందని తహసిల్దార్, సరస్వతి, తెలియజేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ పైఅధికారుల ఆదేశాలతో ఆర్&బి, పంచాయతీ రాజ్,గ్రామ పంచాయతీ సెక్రటరీ, సచివాలయం సిబ్బంది. రెవిన్యూ ఆర్.ఐ, రామకృష్ణ, ఆధ్వర్యంలో (పర్యవేక్షణలో) ఆక్రమణల కొలతలు తీశామన్నారు. స్వచ్ఛందంగా వెనక్కి తగ్గాలని సూచించారు. స్వచ్ఛందంగా తగ్గని పక్షంలో ప్రభుత్వం, పై అధికారుల ఆదేశాను సారం చర్యలు తప్పవని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, సచివాలయం సిబ్బంది. గ్రామపంచాయతీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

రెవెన్యూ సదస్సులో రైతులు వినతి

విశాలాంధ్ర-పాచిపెంట : దశాబ్దాలుగా సాగు చేస్తున్న సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని మండలంలోగల పద్మాపురం రెవెన్యూ పరిధిలోగల తాత ముత్తాతలు నుండి అనుభవంలో ఉన్న రైతుల భూములకు పట్టాలు ఇవ్వాలని ఎంపీపీ ప్రతినిధి పాచిపెంట వీరం నాయుడు డోల బాబ్జి నల్లి గోవిందరావుతో పాటు మరికొంతమంది రైతులు డిమాండ్ చేశారు. భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం పద్మాపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు నుండి భూములను పద్మాపురంతోపాటు బద్నాయక వలస, పులిగంటవలస, మూలవలస, తులసి జోరువలస, పెద్దవలస, రోడ్డవలస, చంద్రుమాను వలస, గల్లపాడు, కొత్తూరు, పింద్రంగివలస పాచిపెంట గ్రామాలకు చెందిన సుమారు 500 మంది పైచిలుకు రైతులు భూములను సాగు చేస్తున్నారన్నారు. అయితే రైతులకు నేటికీ హక్కులు కల్పించక పోవడంతో అన్నివిధాల నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మండలంలో అతిపెద్ద రెవెన్యూ గ్రామం పద్మాపురమే అని 5000 ఎకరాల భూమిని సాగు చేయగా అందులో అధిక శాతం గిరిజనులు ఉన్నారని మరి కొంతమంది బీసీలు ఇతర కులస్తులు కూడా సాగుచేసి జీవనం సాగిస్తున్నారన్నారు. గతంలో ఈ భూములు జరాయితి భూములని పెద్దలు చెప్పుకునేవారని, అయితే కొంతమంది ఈ భూములు ఇనామీ భూములని తమ వేనంటూ కోర్టులు చుట్టూ తిరగడం వలన రైతులకు పట్టాలు ఇవ్వడంలేదని తెలిసిందన్నారు. ఇనామి వ్యవస్థలు రద్దయినప్పటికీ రైతులకు ఇప్పటికీ న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలు మంజూరు విషయంలో అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారో అర్థం కావడం లేదని వాపోయారు. ఈ రెవెన్యూ భూముల సమస్య నిగ్గు తేల్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ రవి మాట్లాడుతూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి.ప్రమీల సర్పంచ్ బద్నాన వీరయ్య సీనియర్ అసిస్టెంట్ పాంచాలి తిరుమలరావు వీఆర్వో పాల్గొన్నారు.

నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభం

టిడ్కో ప్రాజెక్ట్ అధికారి రమణమూర్తి

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రధానమంత్రి ఆవాస యోజన (పిఎంఎవై) లో భాగంగా జిల్లాలో చేపడుతున్న ఎపి టిడ్కో ఇళ్ల నిర్మాణ గుత్తేదారుకు బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఆ నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభం అవుతాయని టిడ్కో ప్రాజెక్ట్ అధికారి డి.వి రమణమూర్తి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. టిడ్కో ఆధ్వర్యంలో ఫేజ్-2 కింద 2,944 గృహాలు మంజురు కాగా, 2,544 గృహాల నిర్మాణ పనులను 2018లో ప్రారంభించినట్లు చెప్పారు. 2019 జూన్ నెలలో 25% కంటే తక్కువ జరిగిన పనులను గత ప్రభుత్వ ఆదేశాలు మేరకు నిలిపివేయటం జరిగిందని, తదుపరి 528 గృహాలను రద్దు చేసి 2016 గృహాలను నిర్మించుట జరుగుచున్నదని ఇందులో పార్వతీపురంలో 768, సాలూరులో 1,056 గృహాలు నిర్మించినట్లు చెప్పారు. పార్వతీపురం మునిసిపల్ పరిధిలో అడ్డాపుశీల లొకేషన్ నందు 16 బ్లాకుల్లో 768 గృహాలు పూర్తయ్యాయని, మురుగునీటి శుద్ధి కేంద్రం 70% పనులు పూర్తికాగా, మౌలిక సదుపాయాల పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో రహదారి, కాలువలు, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు 20% కాగా, మిగిలిన పనులు జరగాల్సి ఉందని తెలిపారు. శాశ్వత తాగునీటి పథకం కొరకు రూ.5.28 కోట్లు మంజూరు కాబడిందని, ఈ పనులు ప్రారంభదశలో వున్నట్లు చెప్పారు. మౌలిక సదుపాయాల గుత్తేదారులకి డిసెంబర్ 2023 నుంచి రూ.92 లక్షలు చెల్లించాల్సి ఉందని, ఈ బకాయిలు చెల్లించినచో గుత్తేదారులు పనులు వేగంగా చేసి సదుపాయాలను త్వరలో అందించగలరని అన్నారు. ఎపిఇపిడిసిఎల్ వారికి రూ.3.08 కోట్లు చెల్లించామని, ఇంకను పనులు ప్రారంభం కావలిసియున్నదని పేర్కొన్నారు. సాలూరు మునిసిపల్ పరిధిలో గుమడాం లొకేషన్ నందు 1,248 గృహాలకు గాను, 300 చ.అ ఇళ్ళు 1142, 365 చ.అ ఇళ్ళు 96 మంజూరయ్యాయని, వీటిలో 1056 గృహాలు నిర్మాణం పూర్తయి లబ్ధిదారులకి అందజేసినట్లు తెలిపారు. తదుపరి పాత గుత్తేదారులకు 192 గృహాలు ప్రారంభించుటకు ఆదేశాలు ఇచ్చామని, కానీ గుత్తేదారులు పనులు ఇంకను ప్రారంభించలేదన్నారు. ఇచ్చట తాగునీటి కొరకు 6 బోర్లు వేయబడి సరఫరా కొరకు పైపులు వేయబడి ఉన్నవని అన్నారు. రెండు రహదారులు కాంక్రీటుతోనూ, ఒక రహదారి డబ్ల్యూఎంఎం తోను వేసి రవాణాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయబడిందని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల పనులు 85% జరిగాయని, అదే విధంగా మురుగునీటి సరఫరా, శుద్ధి కేంద్రం కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా కొరకు ట్రాన్స్ఫర్మర్ లు బిగించి 880 మీటర్ కనెక్షన్లు ఇవ్వబడ్డాయని, మిగిలిన లబ్ధిదారులు విద్యుత్ కనెక్షన్ కొరకు ధరఖాస్తు వేసిన వెంటనే కనెక్షన్ ఇచ్చుటకు విద్యుత్ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకున్నారని తెలిపారు. మౌలిక సదుపాయాల గుత్తేదారులకి డిసెంబర్ 2023 నుంచి రూ.2.46 కోట్లు చెల్లించాల్సి ఉందని, బకాయిలు చెల్లించినచో గుత్తేదారులు పనులు వేగంగా చేసి సదుపాయాలను త్వరలో అందించగలరని, బకాయిల విషయమై పై అధికారులకు తెలియజేశామని అన్నారు. పై నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి లబ్ధిదారులకు గృహాలు అందించడం జరుగుతుందని ఆ ప్రకటనలో వివరించారు.

నెలలు నిండిన గర్భిణీ ఆసుపత్రికి వెళ్లేందుకు నిరాకరణ

కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చేసి ఆసుపత్రికి తరలించిన వైద్యాధికారి
గర్భిణీకి సుఖ ప్రసవం : ఆడబిడ్డకు జననం

విశాలాంధ్ర-సీలేరు : నెలలు నిండిన గర్భిణీ ఆసుపత్రికి వెళ్లేందుకు నిరాకరించింది. పారామెడికల్ సిబ్బంది ఆసుపత్రికి తరలించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ప్రసవ సమయం దగ్గర పడుతుండడంతో వైద్యాధికారి స్వయంగా గ్రామాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చేసి ఆసుపత్రికి తరలించారు. దీంతో సాయంత్రం గర్భిణి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దారపుడి గ్రామంలో పాంగి లక్ష్మి అనే గర్భిణీకి నెలలు నిండడంతో ప్రసవం కోసం ఆసుపత్రికి తీసుకొని రావాలని ఆశా కార్యకర్తను వైద్యాధికారి డీకే.హిమబిందు గ్రామానికి పంపించారు. రెండు రోజులుగా ఆశా కార్యకర్త గర్భిణీని ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. దీంతో శుక్రవారం వైద్యాధికారి హిమబిందు, వైద్యసిబ్బంది గ్రామానికి ప్రయాణమయ్యారు. దారాలమ్మ దేవాలయం నుంచి రెండు కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి గ్రామానికి చేరుకున్నారు. నెలలు నిండిన గర్భిణీని పాంగి లక్ష్మిని పరీక్షించి, గర్భిణీ, కుటుంబ సభ్యులకు వైద్యాధికారి కౌన్సిలింగ్ చేశారు. ఆసుపత్రికి వచ్చేందుకు గర్భిణీ అంగీకరించడంతో కొంత దూరం ద్విచక్ర వాహనంలో, మరికొంత దూరం అంబులెన్స్‌లో ఆమెను ఆసుపత్రికి తరలించారు. అనంతరం గ్రామంలో బాలింతలు, చిన్నారులకు విద్యాధికారి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి గర్భిణీ ప్రసవ సమయానికి 10రోజు ముందు ఆసుపత్రిలో చేరాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవం పొందడం తల్లి బిడ్డకు క్షేమమని, గఅహంలో ప్రసవం పొందడం వల్ల తల్లి బిడ్డ ఆరోగ్యానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎంలు శోభా, ఈశ్వరి, పారామెడికల్ సిబ్బంది బాలకఅష్ణ శ్రీను పాల్గొన్నారు.

కూటమి పార్టీల మధ్యే పోటీ... పీసా ఎన్నికకు దూరంగా వైకాపా

పీసా ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా రామకృష్ణ, సత్యనారాయణ

విశాలాంధ్ర-చింతపల్లి :ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాలలో పిసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీసా కమిటీల ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాలతో పిసా కమిటీలో ఉపాధ్యక్ష, కార్యదర్శి ఎన్నికను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పిసా కమిటీ ఎన్నికల అధికారి పలాసి పండన్న ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ ఎన్నికకు వైకాపా దూరంగా ఉండగా, ఎన్డీఏ కూటమి పార్టీలకు చెందిన తెలుగుదేశం పార్టీ నుంచి దూరి రామకృష్ణ, బిజెపి నుంచి కదుల్ల శ్రీనివాసరావు లు ఉపాధ్యక్ష పదవికి, కార్యదర్శి పదవికి జనసేన నుంచి సుర్ల వీరేంద్ర కుమార్, తెదేపా అభ్యర్థిగా పోటీ చేసిన ముత్యం సత్యనారాయణలు పోటీపడగా వీరిలో ముత్యం సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పోటీ చేసిన దూరి రామకృష్ణకు 134 ఓట్లు, శ్రీనివాసరావుకు 96 ఓట్లు పోలయ్యాయి, తెదేపా అభ్యర్థిగా కార్యదర్శి పదవికి పోటీ చేసిన ముత్యం సత్యనారాయణ 171 ఓట్లు సాధించగా, జనసేనకు చెందిన వీరేంద్ర కుమార్ కు మాత్రం కేవలం 15 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో ఎన్నికల అధికారి పలాస పండన్న దూరి రామకృష్ణను ఉపాధ్యక్షునిగాను, ముత్యం సత్యనారాయణ ను కార్యదర్శిగాను ప్రకటించి సర్పంచు పుష్పలతతో కలిసి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, తెదేపా సీనియర్ నాయకుడు పెదిరెడ్ల బేతాళుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, గ్రామ సచివాలయం సిబ్బంది, అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ స్కూల్‌కి సైకిల్ షెడ్ వితరణ

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం సైకిల్ షెడ్డును టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు నాయుడు వితరణ చేశారు. శుక్రవారంపుట్టినరోజు సందర్భంగా ప్రసాద్ నాయుడు సైకిల్ సెంటర్కు శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమానికి స్థానిక హెచ్ఎం హేమలత భూమి పూజ చేశారు సుమారు 57 అడుగుల పొడుగున పెద్ద అడుగుల వెడల్పున నిర్మాణం చేపడుతున్న ప్రసాద్ నాయుడుకు పాఠశాల సిబ్బంది స్కూల్ కమిటీ చైర్మన్ కోన ఈశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు. సైకిల్ షెడ్‌కు భూమి పూజ చేస్తున్న హెచ్ఎం హేమలత ఆనందం వ్యక్తపరిచారు.

నేటి నుండి కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

విశాలాంధ్ర-పార్వతీపురం : జూనియర్ కళాశాల విద్యార్థులకు 4వ తేదీ నుండి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి. మంజుల వీణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పథకాన్ని ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ కూడా కార్యక్రమంలో పాల్గొంటారని ఆమె చెప్పారు. జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న 5,905 మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారని ఆయన చెప్పారు. ఇందులో 2,338 మంది బాలికలు, 3,567 మంది బాలురు ఉన్నారని ఆమె అన్నారు.

కొనసాగుతున్న వివక్ష....!

ఉపాధ్యాయులేం పాపం చేశారు : పిఆర్టీయు

విశాలాంధ్ర-బెలగాం : గత ప్రభుత్వం సమయంలో జీతాలు సకాలంలో పొందడమే గగనం అయ్యిందని ఈ ప్రభుత్వం వచ్చాక కుదుట పడుతుందని అనుకున్నామని పిఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ తెలిపారు. కానీ మొదటి రెండు నెలలు 1,2 తేదీలలో జీతాలు ఉపాధ్యాయులు అందుకున్నారని గత రెండు నెలల నుండి 3,4 తేదీల్లో జీతాలు అందుతున్నాయని, జీతాల చెల్లింపు గురించి పరిశీలన మీదట అర్థం అయ్యేది ఏంటంటే ముందుగా ఉపాధ్యాయులకు తప్ప మిగిలిన ఉద్యోగులకు 1 వ తేదీ రాత్రి నుండే చెల్లిస్తున్నారని అన్నారు. జీతాల చెల్లింపులో విద్యాశాఖపై ఇంకా ప్రభుత్వాల వివక్ష కొనసాగుతుందని అన్నారు. దాదాపు అన్ని ప్రభుత్వ విభాగాల ఉద్యోగులకు జీతాలు క్రెడిట్ అయ్యాయని పెన్షనర్లకు కూడా పెన్షన్లు క్రెడిట్ అయ్యాయని కానీ విద్యాశాఖకు చెందిన ఉపాధ్యాయుల జీతాలు మాత్రం ఇంకా చెల్లింపులకు నోచుకోలేదని పిఆర్టీయు పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు వాలేటి తవిటి నాయుడు, ప్రధాన కార్యదర్శి కాగాన విజయ్, కార్యనిర్వాహక అధ్యక్షులు గంట శశికుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు భోగి రవికుమార్ అన్నారు. అందరితో పాటు మమ్మల్ని కూడా ఒకేలా చూడండని కోరారు.

ఆర్గానిక్ పంటలతోనే ఆరోగ్యం చేకూరుతుంది

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహసంచాలకులు డాక్టర్ అప్పలస్వామి

విశాలాంధ్ర-చింతపల్లి : ఆర్గానిక్ వ్యవసాయం తో పండించిన పంటలతోనే పరిపూర్ణమైన ఆరోగ్యం చేకూరుతుందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆర్గానిక్ (సేంద్రీయ) వ్యవసాయంపై జరుగుతున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం గ్రామీణ యువతకు వివిధ పంటల్లో పోషక లోపాల నివారణ, డిజిటల్ మార్కెటింగ్, వివిధ పంటల్లో సేంద్రీయ పద్ధతుల్లో పురుగుల యాజమాన్యం వంటి అంశాలపై అవగాహనతో పాటు, విద్యార్థులకు పరిశోధన స్థానంలోని సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను, ఆగ్రో మెటీరియాలజి విభాగాన్ని సందర్శింపజేసి అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపు రెడ్డి, బాల హుస్సేన్ రెడ్డి, సిఎన్ ఎఫ్ సభ్యులు, నైపుణ్య శిక్షణ పొందుతున్న విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయం-3లో ఏకగ్రీవమైన పీసా కమిటీ

ఏకగ్రీవంగా ఎన్నికైన పీసా కమిటీ ఉపాధ్యక్షుడుగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా శివ సంతోష్‌లు

విశాలాంధ్ర-చింతపల్లి : సచివాలయం త్రీ (అంతర్ల)లో శుక్రవారం నిర్వహించిన పీసా కమిటీ ఎన్నికలో ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా గబులంగి నాగేశ్వరరావు, కవడం శివసంతోష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీసా కమిటీ అధ్యక్షురాలు, సర్పంచ్ దురియా పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఏకగ్రీవంగా గెలుపొందిన ఉపాధ్యక్ష, కార్యదర్శిలు మాట్లాడుతూ పీసా చట్టం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి ఆ చట్టం ద్వారా గిరిజనుల చట్టాలు హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా గెలిపించిన ప్రజలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి పలాసి పండన్న, వైకాపా ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెల్లీ సుధాకర్, కాసులమ్మ, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

డిఎంహెచ్ఓగా భాస్కరరావు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా డాక్టర్ ఎస్. భాస్కరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఈయన విజయనగరం డిఎంహెచ్ఓగా పనిచేసారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు సిబ్బంది ఆయనకు ఆరోగ్య కార్యాలయంలో పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీతంపేట డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ కె. విజయపార్వతి ఇంతవరకు డిఎంహెచ్ఓగా విధులు నిర్వహించారు. అందరూ సమన్వయంతో పనిచేస్తూ వైద్య సేవలు అందజేయాలని, జిల్లాకు మంచి గుర్తింపు తీసుకు వచ్చేలా కృషి చేయాలని డిఎంహెచ్ఓ సూచించారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డా.నారాయణరావు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా.పద్మావతి, ప్రోగ్రాం అధికారులు డా.జగన్మోహన్, డా.రఘు, డా.ఎం.వినోద్‌కుమార్, డా.విజయమోహన్, డా.శ్రీధర్, ఆఫీసు సూపరింటెండెంట్ కామేశ్వరరావు, ఎన్జీఓ ప్రెసిడెంట్ జివిఆర్ఎస్ కిషోర్, ఆరోగ్య కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కోరం లేక నిలిచిన పన్నెండు చోట్ల పీసా ఎన్నికలు

ఎన్నికలను పరిశీలిస్తున్న ఎంపీడీవో. ఎస్ కె వి ప్రసాద్

విశాలాంధ్ర-కొయ్యూరు : భారత రాజ్యాంగం ప్రకారం గ్రామ పంచాయతీల్లో తలపెట్టిన పెసా ఎన్నికలల్లో భాగంగా కొయ్యూరు మండలంలో 12 పంచాయితీల్లో కోరం లేని కారణంగా వాయిదా పడినట్టు ఎంపీడీవో కెఎస్వి ప్రసాద్ తెలిపారు. ఈ నెల (3 తేదీన నేడు) శుక్రవారం. మండల పరిధిలో ఉన్న 38 పొలిగింగ్ స్టేషన్లల్లో ఈ ఎన్నికలు ప్రక్రియ ప్రారంభం కాగా వీటిలో 26 స్టేషన్లో ఎన్నికలు జరగగా మిగిలిన 12 చోట్ల ఎన్నికల కోరం సరిపడని కారణంతో మర్రివాడ, ఎం. భీమవరం, కొత్తపల్లి, మూలపేట, ఎం మాకవరం కొయ్యూరు రాజేంద్రపాలెం జీడి పాలెం రామాపురం, కొప్పుకొండ, అర్. కొత్తూరు, రావాణాపల్లి, యూ.చీడిపాలెం గ్రామాల్లో పెసా ఎన్నికలు వాయిదా పడినట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. వీటి ఎన్నికలను తిరిగి ప్రకటించిన తేదీల్లో ఎన్నికల ప్రకటన విడుదల చేసి ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. వాయిదా పడిన చోట్ల శాంతి భద్రతలు తలెత్తకుండా కొయ్యూరు సీఐ వెంకటరమణ పర్యవేక్షించారు.

కూలిన గుమ్మిడిగెడ్డ అక్విడెక్టు తలుపు

వృధాగా గెడ్డలోకి పోతున్న సాగు నీరు
అధికారులు స్పందించి సాగు నీరు కాలువ లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు

విశాలాంధ్ర-కురుపాం : మండల కేంద్రానికి కూత వేటులో ఉన్న గుమ్మిడిగెడ్డ అక్విడెక్టు తలుపు మరామ్మతులకు గురై నేల కూలటంతో సాగు నీరు వృధాగా గెడ్డలోకి వెళ్లి పోతుందని నీటి సంఘం అధ్యక్షులు పడాల శ్రీనివాసరావు, ఎం.సింహాచలం, బంటు తవిటినాయుడు, తెంటు జగన్నాథం నాయుడు, పోలిరెడ్డి శ్రీనివాసరావులు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి వెంటనే మరామత్తులు చేయకుంటే ప్రస్తుతం సాగుకు సిద్ధంగా ఉన్న వరి రెండో పంట సాగుకు ఇబ్బంది తప్పదని సుమారు 1200 ఎకరాలకు సాగు నీరు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయా పరిధిలో ఉన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలువలోకి సాగు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అల్లరి మూకల ఆగడాలు

ప్రయాణికులు, కాలేజీ విద్యార్థినిలు ఇబ్బంది పడుతున్న వైనం
పట్టించుకోని ఆర్టీసీ, జిల్లా పోలీస్ అధికారులు

విశాలాంధ్ర-పాడేరు రూరల్ : అల్లూరి జిల్లా పాడేరు కేంద్రం నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దూర ప్రయాణల కోసమే కాకుండా మన్యం ప్రాంతంలోని అనేక పర్యాటక ప్రదేశాలకు వెళ్లే విహారయాత్రికులు, కాలేజీలకు వచ్చే విద్యార్థులతో, జిల్లా కేంద్రంలో ఉన్న ఆఫీసుల్లో పనికోసం వచ్చే జిల్లా పరిధిలోని ప్రజలుతో పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ నిరంతరం రద్దీగా ఉంటుంది. అటువంటి ప్రదేశంలో కొంతమంది ఆకతాయిలు కాలేజీ విద్యార్థినిలను, ప్రయాణికులను విహారయాత్రకు వచ్చే టూరిస్టులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కాంప్లెక్స్ ఆవరణలోనే సిగరెట్లు కాలుస్తూ మద్యం సేవించి ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నా వీరిని పట్టించుకోవలసిన ఆర్టీసీ అధికారులు మిన్న కొనడంతో ఆకతాయిలు ఆడిందే ఆటగా సాగిపోతుంది.కొన్ని సందర్భాల్లో వీరి మద్యం సేవించి ప్రయాణికుల మీద పడడం ప్రయాణికులు విద్యార్థినులను అసభ్యంగా ప్రవర్తించడం వారి వస్తువులను అపహరించడం లాంటి అనేక సంఘటనలు పాడేరు కాంప్లెక్స్‌లో చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు ఈ ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని మద్యం, సిగరెట్లు కాంప్లెక్స్ ఆవరణలో కాల్చకుండా, తాగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఆర్టిసి కాంప్లెక్స్ సవరణంలో పోలీస్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని పలు ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులతో పాటు పోలీస్ అధికారులు నిగా పెట్టి ఆకతాయిల ఆగడాలు కట్టించాలని ప్రజలు కోరుతున్నారు.